క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హరినామ జపం



జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులకు హారతి ఇస్తున్న అర్చకులు



హరినామ జపం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో సమస్త ప్రజల సుఖ శాంతిల కోసం హరినామ జప యజ్ఞం నిర్వహించారు. స్థానిక పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ.. హరే కృష్ణ జపాన్ని పఠించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక్ ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కుర్ని సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): కుర్ని సామాజిక వర్గానికి చెందిన వారందరూ తమ పిల్లలను విద్యావంతులను చేస్తే వారికి ఉజ్వల భవిష్యత్తును అందించిన వారమవుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధా న కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్‌లో కుర్ని నేసే సంక్షేమ సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ విద్య అత్యంత అవసరమన్నారు. చేనేత, ఇతరత్రా చిన్న చితకా వ్యాపారాలు చేసుకుంటున్న కుర్ని కులస్తులు ఎన్ని కష్టాలు ఉన్నా పిల్లల చదువును అశ్రద్ధ చేయరాదన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కుర్ని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదు గుండు కృష్ణయ్య, బండికే వాసుదేవయ్య, జిల్లా అధ్యక్షుడు గడిగె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరుతో రాజకీయాలు తగదు



చిత్రపటాలను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వైరి పక్షాలు చిత్తశుద్ధి చూపి గౌరవించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. బుధవారం 48వ వార్డు రోజావీధిలో అంబేడ్కర్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై వాదనలు జరగడం బాధాకరమన్నారు. కేంద్ర హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. ఈ అవకాశంతో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో చేసిన రభసా అంతా ఇంతా కాదన్నారు. వైరిపక్షాలు అంబేడ్కర్‌ను గౌరవించాల్సింది పోయి ఆయన పేరుతో రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, పెంచలయ్య, ఆంజనేయులు, రాముడు, సంగాలయ్య, జయంతిబాషా పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



వాజ్‌పేయియా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కల్లూరు: స్థానిక బీజేపీ కార్యాలయం, కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో బుధవారం దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని నాయకులు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయియా దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీఎస్ నాగరాజు, నేషనల్ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ సోమశేఖర్‌రెడ్డి కొనియడారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, రామ మద్దిలేటి, మాజీ కార్పొరేటర్ రంగస్వామి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుబజార్ బంద్

కర్నూలు(అర్బన్): నగరంలోని సీ క్యాంప్ రైతు బజార్‌ను ఈ నెల 26వ తేదీన మూసి వేయనున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ హరీష్‌కుమార్ తెలిపారు. ప్రతి నెలా రైతు బజార్‌ను శుభ్రం చేసే ప్రక్రియలో భాగంగా గురువారం బంద్ నిర్వహిస్తున్నామని, ఈ నేపథ్యంలోనే ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మరుసటి రోజు శుక్రవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని, రైతులు వినియోగదారులు గమనించాలని కోరారు.



ఓర్వకల్లు : ఆర్‌సీఎం చర్చిలో బైబిల్ సందేశం వినిపిస్తున్న పాస్టర్ ఆనందరాజు



గడివేముల: ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



సి.బెళగల్ : ప్రార్థన చేస్తున్న పాస్టర్ సీమోను

లోక రక్షకుడు యేసుక్రీస్తు

- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు
- గీతాలాపనలతో మారుమోగిన చర్చీలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- యేసు జననం ప్రాముఖ్యతను వివరించి పాస్టర్లు



కోడుమూరు: ఏబీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

కోడుమూరు రూరల్: క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దేవుడి కుమారుడు యేసుక్రీస్తు జననాన్ని పరస్కరించుకుని నిర్వహించే క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. ఆయా చర్చీలలో మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన ప్రార్థనలు బుధవారం కొనసాగాయి. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనలు, గీతాలతో చర్చిలు మారుమోగాయి. కేక్‌ల కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రం కోడుమూరుతో పాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడకల సంబరాలు అంబరాన్నంటాయి. ఆయా చర్చిలలో పాస్టర్లు యేసుక్రీస్తు జననం ప్రాముఖ్యతను వివరించారు. యేసు క్రీస్తు లోక రక్షకుడు అని, సన్మార్గంలో నడిచి ప్రభువు కృపకు పాత్రులవ్వాలని సూచించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యేసు లోకరక్షకుడని, ప్రజల కాపరి అని సి.బెళగల్ ఏబీఎం పాస్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలమూరు సీఎస్ఐ చర్చిలో పాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. పాణ్యం ఇంటింటి సువార్త చర్చిలో ప్రార్థనలు చేశారు.

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లుతోపాటు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్‌లు కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఆలపించిన గీతాలతో ప్రార్థనా మందిరాలు హోరెత్తాయి. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో విచారణ గురువులు రెవ.ఫా. ఆనందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో కేడీఎస్ఎస్‌ఎస్ ప్రధాన యాచకుడు, ప్రసంగీకుడు సుధాకర్, సహాయకులు డికాన్ ప్రతాప్ క్రిస్మస్ పవిత్రతను వివరించారు. యేసు ఆజ్ఞలను గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ ఇతరులపై ప్రేమతో మెలగాలని సూచించారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హ్యాపీ క్రిస్మస్...మేరీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గడివేముల ఏబీఎం చర్చిలో పాస్టర్ జాషువా, సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రభు యేసు సందేశాన్ని వివరించారు.

కల్లూరు: క్రిస్మస్ సందర్భంగా కల్లూరు గ్రామీణ, అర్బన్ చర్చీలలో భక్తి శ్రద్ధలతో వేడుకలు జరిగాయి. ఆయా చర్చిలలో పాస్టర్లు ప్రేమ, త్యాగానికి ప్రతీకైన యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఇతరులపై ప్రేమ, శాంతి, దయాగుణాన్ని కలిగి ఉండాలని సూచించారు.



కోడుమూరు: యేసు మార్గాన్ని వివరిస్తున్న పాస్టర్ రెవరెండ్ ఆర్.సామెల్



పాణ్యం: చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



పాణ్యం: ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



ఓర్వకల్లు: ఏబీఎం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



కల్లూరు: బస్తిపాడులో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

చండీయాగానికి నేడు పూర్ణాహుతి

బనగానపల్లె రూరల్ : మండంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్న చండీయాగం గురువారం పూర్ణహుతి కార్యక్రమంతో ముగుస్తుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ బుధవారం తెలిపారు. చండీయాగంలో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు శివుడు, యాగశాలలో ఏర్పాటు చేసిన చౌడేశ్వరిదేవి ఉత్సవమూర్తికి వేదమంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఏపీ జేఎఫ్ఏ రాయలసీమ జోన్ సెక్రటరీగా మౌలాలి

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ రాయలసీమ జోన్ సెక్రటరీగా డోన్ ఫారెస్టు శాఖ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మౌలాలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో మౌలాలిని రాయలసీమ జోన్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ.. అటవీ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు ఉరుకుందలో సుదర్శన హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఈనెల 26న సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు. స్వాతి నక్షత్రం సందర్భంగా దేవస్థానంలో ఈ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరుపున పాల్గొన్న వారికి శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫోటో, దేవాస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం రెండు లడ్డూలున్న బాక్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

నేడు శ్రీనివాస కళ్యాణం

డోన్: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో గురువారం శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాస రావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయంలోని కల్యాణ మండపంలో గోవింద మాలాధారుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే సాయంకాలం గోదాదేవి, శ్రీదేవి సమేతుడైన శ్రీనివాసుడిని పట్టణ పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు.

హోరాహోరీగా బండలాగు పోటీలు

ఓర్వకల్లు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం ఓర్వకల్లులో బుధవారం నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల పాలపళ్ల విభాగం ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక ఏబీఎం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నేత కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. 17 జతల ఎద్దులు పోటీపడగా యువత కేరింతల మధ్య ఉత్సాహంగా సాగాయి. తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూలు జిల్లా, రామవరం రామచంద్రారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలువగా దివంగత కాశిరెడ్డి వెంగళరెడ్డి కుమారులు కాశిరెడ్డి స్వామిరెడ్డి, కాశిరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి సంయుక్తంగా రూ. 35 వేలు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన పాణ్యం మండలం, పిన్నాపురం వెంకటకృష్ణయ్య వృషభాలు రూ.30 వేలు, మూడవ స్థానంలో నిలిచిన వనపర్తి మండలం, పెద్ద దగడ పోగుల యశ్వంత్, పుత్తనూర్ పెద్దింటి నరేష్(ఉభయజత) వృషభాలు రూ.20 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన ఆళ్లగడ్డ మండలం బిల్లలాపురం భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు రూ.10 వేలు కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా గురుజాల ధరని చౌదరి వృషభాలు, బి.తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం వృషభాలు, అనంతపురం జిల్లా, ఆత్మకూరుకు చెందిన విశ్వనాథ్‌రెడ్డి వృసభాలు దూలాన్ని సమానంగా లాగి ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో నిలిచి రూ. రూ.3,300 చొప్పున బహుమతులు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చెట్ల రాజు, దానమయ్య, రెడ్డిపోగు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం



క్యాలెండర్లను విడుదల చేస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కురువ కులస్థులు ఐకమత్యంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం స్థానిక ఎంపీ కార్యాలయం ఆవరణలో నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురువ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎలాంటి సమస్య వచ్చినా, సంఘం కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ సంఘం సేవలను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా కురువలు తమ చిన్నారుల విద్య పట్ల అశ్రద్ధ చేయకుండా చదివించాలన్నారు. అలాగే విద్య, ఉపాధి, ఉద్యోగ సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగే కురువలకు సహకారం అందించాలని కోరారు. అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత, ఉమ్మడి జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్ యుగంధర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిస్కంల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

కర్నూలు(సెంట్రల్): చండీఘర్ ప్రభుత్వ డిస్కం ప్రైవేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్, పాతబస్టాండ్‌లోని చౌకు బజారులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక వరుసగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘర్ ప్రభుత్వ విద్యుత్ డిస్కంను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ సంస్థ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.250 కోట్ల నుంచి రూ.360 కోట్ల లాభం వస్తోందని, లాభాలు తెచ్చే పెట్టే సంస్థను ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా ప్రజలపై భారం పడక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్.నరసింహులు, విజయ్ పాల్గొన్నారు.



సుందరయ్య సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

బైక్ ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామానికి వెళ్లేదారిలో బుధవారం సాంయత్రం బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు అయ్యాయి. పట్టణానికి చెందిన కుమార్ అనే వ్యక్తి బైక్‌పై గుడేకల్ గ్రామానికి వెళ్లి తిరిగి పట్టణానికి వస్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు, శరీర భాగాలపై గాయాలు కావటంతో చికిత్స కోసం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అలరించిన కోలాటం

కర్నూలు కల్చరల్: ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సూర్య కళా కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏ క్యాంప్‌లోని హార్ట్ ఫౌండేషన్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జానపద సంగీత నృత్యోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని ఏపీఎస్‌పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబుబ్ బాషా, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర మోక్షేశ్వరుడు, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ ఆర్కే శర్మ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడారు. యువత తమకిష్టమైన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. జానపద నృత్యాలు, కోలాటాలు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింభిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు అలరించాయి. కార్యక్రమంలో సూర్య కళా కల్చరల్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు సోమశంకరయ్య, పద్మావతి, మృదంగం గురువు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న యువతులు

రబీలోనైనా కలిసొచ్చేనా ?



వరినాట్లు వేస్తున్న కూలీలు

పాణ్యం: అన్నదాతలకు సాగు కష్టాలు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రత్యేకించి వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాణ్యం మండలంలో అత్యధికంగా వరి సాగు చేస్తారు. ఖరీఫ్‌లో దాదాపుగా 6వేల ఎకరాలకు పైగానే రైతులు వరి సాగు చేశారు. అయితే తుపాన్ మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాలకు రూ. 30 వేలకుపైగా పెట్టుబడి పెట్టిన రైతులు నష్టాలు చూడాల్సి వచ్చింది. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఎకరానికి 30-35 బస్తాల దిగుబడి వచ్చింది. దిగుబడులు తగ్గడంతోపాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో వరి తీవ్రంగా నష్టపోయారు. వరికి మద్దతు ధర కల్పించాలని ప్రతిపక్షాలు, రైతుంఘాలు మొరపెట్టుకున్నా స్పందన లేదు. కేవలం బస్తా రూ. 1,400 వరకు పలికింది. దీంతో తప్పనిపరిస్థితుల్లో నష్టాలకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఖరీఫ్‌లో నష్టాలు చవిచూసిన రైతులు దేవుడిపై భారం మోపి రబీ వరి సాగుకు సిద్ధం అవుతున్నారు. మండల పరిధిలోని ఆలమూరు, కొణిదేడు గ్రామాల్లో వరినాట్లు ప్రక్రియ వేగంగా సాగుతుంది. అదేవిధంగా కొండజుటూరు, పాణ్యం, గోరుకల్లు, భూపనపాడు, గోనవరం గ్రామాల్లో వరి సాగుకు రైతులు మడులను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తే ఖరీఫ్ నష్టాన్ని పూడ్చుకోవాలని రైతులు కొండంత ఆశతో వరి సాగు చేపట్టారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగ సందర్భంగా బెలుం సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరా హోరీగా పోటీలు సాగాయి. స్థానిక సీఐ రమేష్‌రెడ్డి, బెలుంకు చెందిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఫైనల్ మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉత్కంఠగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శివ టీం మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, తాడిపత్రికి చెందిన టీసీఈ స్పోర్ట్ క్లబ్ టీం రెండో స్థానంలో నిలిచింది. కొలిమిగుండ్ల మహేష్ టీం మూడవ స్థానం, బనగానపల్లెకు చెందిన టార్గెట్ టీం నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు దాతల సహకారంతో సీఐల చేతుల మీదుగా రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.5016ల నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బహుమతి దాతలు సర్పంచ్ నీలం మారమ్మ, ధనరాజు, ఏసేయ్య పాల్గొన్నారు.

కిరాణాషాపులో చోరీ

కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో మంగళవారం అర్ధరాత్రి ఓ కిరాణా కొట్టులో చోరీ జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన రాజేష్ రాత్రి కిరాణా షాపు షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు షట్టర్‌కు వేసిన తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. కౌంటర్ టేబుల్‌లో ఉన్న రూ. 8 వేల నగదు, సిగరెట్ ప్యాకెట్లను అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం షాపుకు వచ్చే సరికి షట్టర్ తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. చోరీ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గృహ యజమానులకు నోటీసులు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇటిక్యాల రెవెన్యూ పరిధిలో ఉన్న గృహాల బేస్‌మెంట్‌లకు రెవెన్యూ సిబ్బంది నోటీసులు అతికించారు. 112/ఏ,738,763,765 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో కొంత మంది ఏడాది క్రితం ఇళ్ల నిర్మాణాలు చేసుకోగా మరి కొంత మంది బేస్‌మెట్‌లు నిర్మించుకున్నారు. ఇందులో కొంత మంది గ్రూపుగా ఏర్పాటై ప్రభుత్వ స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మరి కొంత మంది నిరుపేదలు సొంతిళ్లు లేక పోవడంతో అష్టకష్టాలు పడి బేస్‌మెట్‌లు ఏర్పాటు చేసుకున్నారు. 120 మందికిపైగానే రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంతో గృహ యజమానులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణాలు చేసుకున్న వాళ్లు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అభ్యంతరాలను తెలపాలని నోటీసులో పేర్కొన్నారు.



వీధులు బురదమయం

మూలపెద్దమ్మ ఆలయానికి వెళ్లే రహదారిలో మురగునీరు పారుతున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రం గడివేములలోని పలు వీధులు బురదమయంగా మారాయి. ముఖ్యంగా పాత ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెద్దమ్మ ఆలయానికి వెళ్లే రహదారి, బీసీ కాలనీ రహదారి అధ్వానంగా మారాయి. మురుగు నీరు ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతుంది. రోడ్డుపైనే వృథా నీరు పోస్తుండటంతో రహదారిలో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రత్యేకించి ప్రతి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మూలపెద్దమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. అమ్మవారి ఆలయానికి వెళ్లాలంటే ఈ మురుగు నీటిలోనే వెళ్లాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డుపై మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.